Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only.
To know more, please visit: www.freegurukul.org

ప్రభాత
వెలుగు లైఫ్
శుక్రవారం
08. 03.05.2019
www.v6velugu.com

ఆలోచన



# ఈ స్కూల్లో... ఫీజుకి బదులు ప్లాస్టిక్

స్కూల్ బెల్లు మోగిందంటే చాలు.. మోపెడు బరువుండే బ్యాగులతో గుంపులు గుంపులుగా పిల్లలు పరుగెత్తడం చూస్తుంటాం. కానీ భుజాన బ్యాగులతో పాటు.. చేతిలో పాలిథేన్ బ్యాగుల నిండా వాడి పారేసే ప్లాస్టిక్ చెత్తతో స్కూల్‌కెళ్లడం చూశారా? అసోం రాష్ట్రంలోని 'అక్షర్ స్కూల్' గేట్ దగ్గర రోజూ ఇలాంటి సన్నివేశమే కనిపిస్తుంది. ఇదంతా ఏంటబ్బా అనుకుంటున్నారా? ఏ స్కూల్లోనైనా ఫీజు కట్టి చదువుకోవాలి. కానీ మజిన్ ముక్తర్, పర్మిత శర్మ దంపతులు స్థాపించిన స్కూల్లో పిల్లలు... తమ ఇంట్లో నుంచి వాడి పారేసే ప్లాస్టిక్‌ని రోజూ తీసుకెళ్లాలి. అదే స్కూల్ ఫీజు కిందకు లెక్కన్నమాట.



**అసలు** ఎందుకీ ప్లాస్టిక్ చెత్త? వీటితో ఏం చేస్తారు? అసలు ఎవరైనా డబ్బుల రూపంలో ఫీజు తీసుకుంటారు. కానీ వీళ్లేంటి ఇలా? అని ఆశ్చర్యపోతున్నారా? ఇదంతా ఆ దంపతులు సామాజిక బాధ్యతతో చేస్తున్న పని.

## ఎవరీ మజిన్, పర్మిత్‌లు?

ఒక స్కూల్ ప్రాజెక్ట్ మీద మజిన్ అనే యువకుడు 2013లో న్యూయార్క్ నుంచి మన దేశానికి వచ్చాడు. అప్పుడు తన పనిలో భాగంగా 'టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెన్స్'లో మాస్టర్స్ చేసే పర్మిత అనే అమ్మాయితో పరిచయమైంది. ఆమె కూడా మజిన్‌లాగే విద్యారంగంలో పని చేయాలనే ఆశయంతో ఉండేది. అలా వాళ్ల పరిచయం ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు.

## 'పమోహీ'నే ఎందుకు?

దేశంలో ప్రతిచోటా ప్లాస్టిక్ వాడకం ఉంది. అయితే అసోంలోని పమోహీ ప్రాంతం ప్రజలు ప్లాస్టిక్ వాడకం ఒక్కటే కాదు... మరో అనర్థానికీ పాల్పడుతుండేవాళ్లు. అదేంటంటే... మంట వేసుకోవడానికి ప్లాస్టిక్ చెత్తను వాడటం. అక్కడ చలిగా ఉందంటే చాలు, ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల వంటి చెత్తను కాల్చేవాళ్లు. ఆ విషయం తెలుసుకున్న పర్మిత, మజిన్‌లు... ఎలాగైనా ఆ ఊరివాళ్ల అలవాటును మాన్పించి, దానివల్ల ఆరోగ్యానికి కలిగే హానిని ఆపాలనుకున్నారు.



## 'అక్షర్ స్కూల్' ఎలా పుట్టింది?

పమోహీలో ఉండే చాలామంది పేద పిల్లలు బడికి వెళ్లేవాళ్లు కాదు. రాళ్లు కొట్టడానికి వెళ్లి రోజుకు రూ.150 నుంచి రూ.200 సంపాదించి తల్లిదండ్రులకు తెచ్చి ఇచ్చేవాళ్లు. ఏ నిరుపేద బతుకు మారాలన్నా, వాళ్ల పిల్లలకు విద్య అవసరమని నమ్ముతారు పర్మిత, మజిన్‌లు. అందుకే అక్కడి పిల్లలకు ఉచితంగా విద్యను అందించాలనుకున్నారు. 2016 జూన్ నెలలో పేద పిల్లల కోసం 'అక్షర్ స్కూల్'ని ప్రారంభించారు.

అక్షర్ స్కూల్లో విద్యార్థులు మొదట ఇరవై మందే చేరారు.

తర్వాత అక్కడి తల్లిదండ్రుల్లో మార్పు వచ్చి పిల్లలను స్కూల్‌కి పంపడం ప్రారంభించారు. అలా విద్యార్థుల సంఖ్య వందకి చేరింది. వాళ్లంతా నాలుగు నుంచి పదిహేనేళ్ల మధ్య వయసున్న పిల్లలు. వారానికి ఒక్కో విద్యార్థి కచ్చితంగా 25 ప్లాస్టిక్ చెత్త పదార్థాలు తీసుకురావాలని చెప్తుంది స్కూల్ యాజమాన్యం.

స్కూల్ మిగతా వాటిలా కాకుండా... ప్రతిదాంట్లోనూ వైవిధ్యంగా ఉంటుంది. క్లాస్‌రూముల నుంచి సబ్జెక్ట్స్, హోంవర్క్ వరకు అన్నీ డిఫరెంట్‌గానే ఉంటాయి. వచ్చే ఐదేళ్లలో ఇలాంటి స్కూళ్లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ఆ దంపతులు ప్రయత్నిస్తున్నారు.



## ఏమేం సబ్జెక్ట్స్ ఉంటాయి?

అన్ని స్కూళ్లలో ఉండే సబ్జెక్ట్స్ ఉండవు ఇక్కడ. ప్రత్యేకంగా సంగీతం, నాట్యం, సోలార్ ప్యానెలెంగ్, ఎంబ్రాయిడరీ, కాస్మొటాలజీ, కార్పెంట్రీ, గార్డెనింగ్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రానిక్స్, రీసైక్లింగ్ వంటి ఒకేషనల్ కోర్సులు ఉంటాయి. చదువు పూర్తయిన వెంటనే, ప్రతి విద్యార్థికి ఏదో ఒక ఉపాధి లభించాలన్నదే ఈ స్కూల్ లక్ష్యం.





## ప్లాస్టిక్... ఫీజుగా ఎలా మారింది?

ప్లాస్టిక్ కాల్చడం వల్ల వచ్చే పొగ ఆరోగ్యానికి హానికరం అని వాళ్లకు తెలియదు. ఆ విషయాన్ని వాళ్లకు అర్థమయ్యేలా చెప్పాలనుకున్నారు. దాని కోసం ఊరూరా తిరిగి ప్రచారం చేశారు. అంతేకాదు, స్కూల్లో పిల్లలకు అవగాహన కల్పించడం మొదలుపెట్టారు. ప్రతి విద్యార్థీ తమ ఇంట్లో నుంచి రోజూ స్కూల్‌కి ప్లాస్టిక్ చెత్త తేవాలని చెప్పారు. తెచ్చిన దానిని ఏదో ఒక అవసరానికి ఉపయోగపడేలా రీసైక్లింగ్ చేయడం ప్రారంభించారు. ఆ దిశగా పిల్లలకు శిక్షణ కూడా ఇస్తున్నారు.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only.
To know more, please visit: www.freegurukul.org